దశాబ్దాల కల సాకారం


శ్రీనివాసనగర్ గెడ్డపై కొత్తగా నిర్మించిన బ్రిడ్జి


బ్రిడ్జికి రెండు వైపులా నిర్మిస్తున్న అప్రోచ్ రోడ్

- శ్రీనివాసనగర్ గెడ్డపై విశాలమైన బ్రిడ్జి నిర్మాణం
- వాహనాల రాకపోకలకు మార్గం సుగమం

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు శ్రీనివాసనగర్ గెడ్డపై బ్రిడ్జి నిర్మాణంతో దశాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరింది. శ్రీనివాసనగర్‌కు సరైన రోడ్డు కనెక్టవిటీ లేక ఎంతో కాలంగా జనం పడుతున్న ఇబ్బందులు కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ కృషితో తొలగాయి. శ్రీనివాసనగర్, నందగిరినగర్, గోశీల పాలెం ప్రాంతాల నుంచి 80 ఫీట్ రోడ్డుకు గానీ.. అటు అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డుకు గానీ వెళ్లేందుకు సరైన రహదారి సదుపాయం లేక దశాబ్దాల కాలంగా స్థానికులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఇరుకైన రోడ్డు కావడంతో కేవలం ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్లడానికి అవకాశం ఉంది. అత్యవసర సమయాల్లో అంబులెన్స్ కూడా రావడానికి మార్గం లేని పరిస్థితి. స్థానికుల అభ్యర్థనతో శ్రీనివాసనగర్ గెడ్డ నుంచి కర్రివాని బ్రిడ్జి వరకు రోడ్ కమ్ బ్రిడ్జి నిర్మించాలని 2013లో ప్రతిపాదించారు. దీని కోసం అప్పట్లో జీవీఎంసీ సుమారు రూ.12 లక్షల నిధులు కేటాయించి టెండర్లు పిలిచింది. అది కార్యరూపం దాల్చేలోపు నాటి కార్పొరేటర్ల పదవీ కాలం ముగియడంతో ప్రతిపాదన మరుగున పడింది.

కార్పొరేటర్ కృషితో సమస్య పరిష్కారం

స్థానికుల చిరకాల సమస్యను పరిష్కరిస్తానని ప్రస్తుత కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ జీవీఎంసీ ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ మేరకు జీవీఎంసీ నుంచి రూ.33.50 లక్షలు నిధులు మంజూరు చేయించారు. శ్రీనివాసనగర్ గెడ్డపై నాలుగు చక్రాల వాహనాలు రాకపోకలు సాగించేలా కొత్తగా బ్రిడ్జి నిర్మించారు. దానికి ఇరు వైపులా అప్రోచ్‌రోడ్ నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. నాలుగు చక్రాల వాహనాల రాకపోకలు సాగించేలా విశాలమైన బ్రిడ్జి నిర్మించడంతో శ్రీనివాసనగర్, నందగిరినగర్, గోశీలపాలెం ప్రాంతాల్లో నివసిస్తున్న 3 వేల కుటుంబాలు, 12 వేల జనాభాకు ప్రయోజనం చేకూరింది. ఆయా ప్రాంతాల నుంచి 80 ఫీట్ రోడ్‌కు కనెక్టవిటీ ఏర్పడింది. హామీని నెరవేర్చిన కార్పొరేటర్ ఉషశ్రీకి స్థానికుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

సకాలంలో వినతుల పరిష్కారం


అర్జీదారు సమస్య వింటున్న జెడ్సీ కృష్ణ

కంచరపాలెం: ప్రజా సమస్యలపై అందిన వినతులను సకాలంలో పరిష్కరించాలని అధికారులను జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 05 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని ఆయన స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 03, యూసీడీకి 01, ఇంజినీరింగ్ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. స్పందనలో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టీఎస్ఎస్ రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ టి.ప్రసన్నరెడ్డి, డీఈ భరణికుమార్, టౌన్ ప్లానింగ్ అధికారి అపరంజిత, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, ఎస్ఎస్ జనార్దన్, ఏపీడీలు పద్మావతి, చిరంజీవి పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే నేరాల నియంత్రణ



మాట్లాడుతున్న ఫిఫ్త్ టౌన్ సీఐ సాయి

మర్రిపాలెం: ఇటీవల కాలంలో జరుగుతున్న నేరాలను నియంత్రించేందుకు ప్రజలందరూ సహకరించాలని కంచరపాలెం ఐదో పట్టణ సీఐ ఎన్.సాయి కోరారు. ఐటీఐ జంక్షన్ తుమ్మలపాలెంలోని చైతన్యం, కల్చరల్ రీడింగ్ రూమ్ వద్ద సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చైన్ స్నాచింగ్, బైకు చోరీలు, సైబర్‌నేరాలు ఎలా జరుగుతాయో వివరించారు. వాటిని గమనించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాలు నియంత్రించేందుకు ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా నేరాలకు పాల్పడుతున్న వారిని త్వరితగతిన గుర్తించి నియంత్రించవచ్చని చెప్పారు. బర్మాక్యాంప్, చాకలిగెడ్డ, సంకూరుపేట, ఐటీఐ జంక్షన్ మొదలగు ప్రాంతాల నుంచి ఆకతాయిలు వచ్చి రీడింగ్ రూం మేడ మీద, ఆయా ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారని, ఆ ప్రాంతాల్లో తిరుగుతున్న మహిళలను అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని సమాచారం అందగా.. సీఐ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రజలకు నేరాల నియంత్రణపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ సమీర్, క్రైం ఎస్ఐ సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాలపై అవగాహన

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి అబిద్‌నగర్‌లో సోమవారం సీసీ కెమెరాలపై సీఐ ఎస్.విజయకుమార్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దాని వల్ల దొంగలను గుర్తించడం వీలువుతుందని చెప్పారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే తక్షణమే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. నగదు, విలువైన ఆభరణాలను బ్యాంక్ లాకర్‌లో భద్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీసులు, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన కె.కె.రాజు



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం నిర్వహించిన వైఎస్సార్‌సీపీ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు మర్యాదపూర్వకంగా కలిశారు.
– సీతమ్మధార

సీసీ కెమెరాలకు ఆటంకం కలగకుండా చర్యలు


సీసీ కెమెరాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగిస్తున్న పోలీసులు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కార్యక్రమం సోమవారం చేపట్టారు. సీఐ ఎస్.విజయకుమార్ ఆధ్వర్యంలో అక్కయ్యపాలెం హైవేతోపాటు పలు ప్రాంతాల్లోని కొమ్మలను పోలీస్ సిబ్బంది తొలగించారు. సీసీ కెమెరాలకు ఆటంకం కలుగకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ప్రజల సహకారంతో కాలుష్య నియంత్రణ


సైకిల్‌పై కార్యాలయానికి చేరుకుంటున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య నిర్మూలనకు నగర పౌరులందరూ సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. సోమవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి జీవీఎంసీ కార్యాలయానికి సైకిల్‌పై చేరుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కాలుష్య రహిత నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు ప్రజల సహకారం అవసరమన్నారు. నగరంలో శబ్ద, వాయు కాలుష్యం విపరీతంగా పెరుగుతున్న దృష్ట్యా సాధ్యమైనంత వరకు కాలుష్య రహిత వాహనాలు వినియోగించాలని పిలుపునిచ్చారు.

'స్పందన'కు 25 అర్జీలు


అర్జీలు పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆనంద్‌కుమార్

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 25 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎం.ఆనంద్‌కుమార్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

జోరుగా ఆరోగ్య సురక్ష సర్వే


స్థానికులకు టోకెన్లు అందిస్తున్న రవికుమార్

మురళీనగర్: జీవీఎంసీ 49వ వార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే జోరుగా సాగుతోంది. ఏఎస్సార్ నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలతో కూడిన బృందం వార్డులోని 285 సచివాలయం కన్వీనర్, భత్రాజుల కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.రవికుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించారు. నివాసులకు బీపీ, సుగర్ పరీక్షలు చేసి వారి ఆరోగ్యం వివరాలను నమోదు చేసి టోకెన్లు అందించారు. వలంటీర్ ఎం.రాము, ఏఎన్ఎం మేరీ, ఆశా వర్కర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంచుకోవాలి


శిక్షణకు హాజరైన ఎన్‌టీపీసీ అధికారులతో ఐఐఎం అధికారులు

ఏయూ క్యాంపస్: సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎన్‌టీపీసీ సింహాద్రి హెచ్‌వోపీ సంజయ్‌కుమార్ సిన్హా అన్నారు. ఐఐఎం విశాఖపట్నం క్యాంపస్‌లో ఎన్‌టీపీసీ అధికారులకు నిర్వహిస్తున్న లీడర్‌షిప్ కోర్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిలో పరిణితి సంస్థ అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు వ్యక్తి ఉన్నతికి ఉపయుక్తంగా నిలుస్తాయన్నారు. ఐఐఎం విశాఖపట్నం ఇటువంటి కార్యక్రమాలను విస్తృతగా నిర్వహించాలన్నారు. నిర్వహణ సామర్థ్యాలను పెంపొందించుకునే విధంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఎన్‌టీపీసీ హెచ్‌ఆర్ విభాగాధిపతి రుమా డి.శర్మ మాట్లాడుతూ ఇటువంటి ప్రత్యేక కోర్సులు సంస్థలో పనిచేసే ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయన్నారు. ఐఐఎం పరిపాలన విభాగం డీన్ ఆచార్య ఎం.వి.అనూరాధ మాట్లాడుతూ భవిష్యత్ నాయకత్వాన్ని తీర్చిదిద్దడానికి, సంస్థ ప్రగతికి దోహదపడే వ్యక్తులుగా తమ సిబ్బందిని మలచడానికి ఇటువంటి ప్రత్యేక కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఐఎం సంచాలకుడు ఆచార్య ఎం.చంద్రశేఖర్, ప్రోగ్రాం డైరెక్టర్ ఆచార్య విశాల్ సింఘ్ పట్యాల్, తదిరతులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో నవంబరు 2, 3, 4 తేదీల్లో ద్రవ స్ఫటికాలపై నిర్వహించే మూడు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సదస్సుకు దేశ, విదేశాల శాస్త్రవేత్తలు, పరిశోధకులు 250 మందికిపైగా హాజరై తమ పరిశోధన పత్రాలను సమర్పించనున్నారు. ఈ కార్యక్రమంలో సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆచార్య కె.బసవయ్య, కన్వీనర్ డాక్టర్ రామకృష్ణ నాంచార రావు, భౌతిక శాస్త్ర విభాగాధిపతి ఆచార్య ఎస్.శ్రీనివాసరావు, ఆచార్య ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ.. అందరి బాధ్యత


కార్యక్రమంలో పాల్గొన్న రెక్టార్ ఆచార్య సమత, పరిశీధకులు, అధికారులు

ఏయూ క్యాంపస్: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ వినియోగాన్ని విడనాడటం తప్పనిసరని ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాల యం మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగం ఆధ్వర్యంలో మైక్రో ప్లాస్టిక్స్ ఇన్ మెరైన్ ఎన్విరాన్‌మెంట్ అంశంపై నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతు లు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించాలని సూచించారు. ప్లాస్టిక్ కాలుష్యం కారణంగా సముద్ర జీవులకు ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. యూరోపియన్ కమిషన్ అందించిన ప్రాజెక్టులో భాగంగా ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొత్తం 25 మంది పరిశోధకులు, అధ్యాపకులు, సహాయ ఆచార్యులు, మత్స్యశాఖ, జీవీఎంసీ అధికారులు ఈ శిక్షణ తరగతులకు హాజరయ్యారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జానకీరామ్, డాక్టర్ కె.ఉమాదేవి, విభాగ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

తల్లీ, కుమార్తె అదృశ్యం


చిన్నకుమార్తెతో శ్రీలక్ష్మి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వివాహిత కుమార్తెతో కలిసి అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గల్లా శ్రీలక్ష్మి అనే వివాహిత కప్పరాడలో భర్త గల్లా ప్రకాష్, ఇద్దరు కుమార్తెలతో కలిసి నివసిస్తోంది. వీరికి వివాహమై ఐదేళ్లు అయ్యింది. భర్త అదే ప్రాంతంలో కంప్యూటర్ సెంటర్ నడుపుతున్నాడు. ఈ నెల 6న సాయంత్రం 7 గంటల ప్రాంతంలో ఇంట్లో ఇవరూ లేని సమయంలో శ్రీలక్ష్మి చిన్నకుమార్తెను తీసుకుని ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో అంతటా గాలించినా ఫలితం లేక పోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎన్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ సతీష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

మేడ పైనుంచి దూకిన యువకుడికి గాయాలు

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువకుడు మేడ పైనుంచి దూకి గాయాలపాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. సీతంపేట రాజేంద్రనగర్‌లో నివసిస్తున్న భవానీశంకర్ అనే యువకుడు ఆదివారం రాత్రి ఇంటి మేడపై మద్యం తాగి ఫోన్‌లో మాట్లాడుతున్న సమయంలో కిందికి దూకడంతో గాయాలయ్యాయి. స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న యువకుడి స్థితిని సీఐ సిహెచ్.సింహాద్రినాయుడు పరిశీలించారు. చికిత్స అనంతరం సోమవారం భవానీశంకర్ ఇంటికి చేరుకున్నాడు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

మురళీనగర్: మురళీనగర్ సెక్షన్ పరిధిలోని మురళీనగర్ 11 కేవీ ఫీడర్‌లో ఏఎల్ 59 జీబ్రా కండక్టర్స్ ఏర్పాటు పనులు కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు తెన్నేటినగర్, వర్మా కాంప్లెక్స్, మురళీనగర్, బాలభాను పాఠశాల ప్రాంతం, బర్మా కాలనీ, పట్టాభిరెడ్డితోట, ఎన్‌జీజీవోస్ కాలనీ, అయ్యప్పనగర్, మసీదు ప్రాంతం, సింగరాయిమెట్ట, మంచుకొండ గార్డెన్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

చురుగ్గా రహదారి నిర్మాణం


రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఆళ్ల శ్రీనివాస్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు రైల్వే న్యూకాలనీలో అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ప్రాంతంలో డ్రైనేజీలు, రహదారుల నిర్మాణం కోసం జీవీఎంసీ మంజూరు చేసిన నిధులతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రైల్వే న్యూకాలనీలోని జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ నుంచి కోళ్లఫారం వరకు గల సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. వీటిని వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాస్ పరిశీలించారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని కారు ఢీకొనడంతో గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం దుర్గానగర్‌లో నివసిస్తున్న బి.మహంతి దుస్తుల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో తన బావమరిది బైకుపై కంచరపాలెం నుంచి పూర్ణామార్కెట్‌కు వెళ్తున్న క్రమంలో జ్ఞానాపురం వద్దకు వచ్చేసరికి గాజువాక నుంచి అటుగా వస్తున్న ఏపీ08ఎఫ్ 6126 నంబర్ గల కారు వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. వెనక కూర్చున్న మహంతి ఒక్కసారిగా కింద పడిపోగా.. అతడి కుడి కాలుకు ఫ్రాక్చర్ అయ్యింది. క్షతగాత్రుడిని చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. మహంతి ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

కేవీలో తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్


మాట్లాడుతున్న సీనియర్ డీపీవో రంజన్ మహంతి


టెస్టింగ్ క్యాంప్‌లో పాల్గొన్న స్కౌట్స్ అండ్ గైడ్స్

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెం హైవేలోని కేంద్రీయ విద్యాలయం వాల్తేర్‌లో సోమవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ కోసం తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్‌ను ముఖ్య అతిథి ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు నేటితరం పిల్లలు కేవలం విద్యకే పరిమితం కాకుండా విద్యేతర సంబంధిత ప్రత్యేక కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలని సూచించారు. దీని ద్వారా వివిధ రంగాల్లో ప్రావీణ్యం సంపాదించవచ్చన్నారు. కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ మాట్లాడుతూ విద్యార్థులు స్కౌట్స్ అండ్ గైడ్స్, ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి, జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. ఈ క్యాంప్‌లో 11 స్కూళ్ల నుంచి సుమారు 200 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్ పాల్గొన్నారు. మూడు రోజుల పాటు శిబిరం కొనసాగుతుంది. విద్యార్థులు ఇంతవరకు నేర్చుకున్నవి పరీక్షించుకుంటూ, స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉద్యమం, నాట్స్, హిచెస్, ప్రథమ చికిత్స, క్రమశిక్షణ, షేరింగ్ అండ్ కేరింగ్, డూ టు ఏ గుడ్ టర్న్ వంటి విషయాలు నేర్చుకుంటారు. ఈ సందర్భంగా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయిని శైలజ, సిబ్బంది ప్రభాకర్, ఎం.రేఖ, వై.విజయలక్ష్మి, జగన్‌మోహన్, మణిబాబు తదితరులు సహకరిస్తున్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి విరాళాలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం అనకాపల్లికి చెందిన మళ్ల రామకోటేశ్వరరావు లక్షా 116 రూపాయిల విరాళం ఇచ్చారు. దేవస్థానం తరఫున దాతకు పీఆర్వో నాయుడు అన్నప్రసాద బాండ్ అందజేశారు. స్వామివారి దర్శనం కల్పించారు.

- అన్నప్రసాద పథకానికి నగరానికి చెందిన బి.అశ్విని, సురేందర్‌రెడ్డి దంపతులు రూ.లక్ష విరాళం ఇన్‌చార్జి ఏఈవో పాలూరి నరసింగరావుకు అందజేశారు. దాతలకు స్వామి దర్శనం కల్పించారు.

వెలగని లైట్లు.. అంధకారంలో వీధులు

- సమస్య పరిష్కరించాలని స్థానికుల విజ్ఞప్తి



యల్లబిల్లివారి వీధిలో వెలగని లైట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డులోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైట్లు సక్రమంగా వెలగక.. అంధకారం అలుముకుంది. కంచరపాలెం జోగారావునగర్ సచివాలయం పరిధిలోని గంగన్ననగర్, యల్లబిల్లివారి వీధి, అశోక్‌నగర్, కొత్తరెడ్డి కంచరపాలెం, తిక్కవానిపాలెం, జోగారావునగర్ తదితర ప్రాంతాలు చీకట్లతో నిండిపోతున్నాయి. విద్యుత్ స్తంభాలకు లైట్లు లేకపోవడం, కొన్ని చోట్ల అవి పనిచేయకపోవడంతో వీధుల్లో చీకట్లు రాజ్యమేలుతున్నాయి. గంగన్ననగర్‌లో 10 రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రాంతంలోని 65బీ/1 నుంచి 10, 89బీ/6 నుంచి 12 స్తంభాలకు లైట్లు సక్రమంగా పనిచేయడం లేదు. చీకటితో నిండిన వీధులు ఆకతాయిలు, దొంగలకు నెలవుగా మారుతున్నాయి. గత నెలలో కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షాలకు కొన్ని చోట్ల విద్యుత్ దీపాల వైర్లు తెగిపోయి మరమ్మతులకు గురయ్యాయి. రాత్రి వేళ చీకట్లలో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. తిక్కవానిపాలెం, జోగారావు నగర్ ప్రాంతాల్లో ఆకతాయిలు, మందుబాబులు వీధిలైట్ల కనెక్షన్లు తొలగించి రోడ్లుపై చిందులు వేస్తున్నారని పలువురు స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు దృష్టి సారించి విద్యుత్ లైట్ల సమస్యను పరిష్కరించాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

'బీజేపీది కపట నాటకం'

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశంపై బీజేపీది కపట నాటకమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ విమర్శించారు. మోదీ నిరంకుశ పాలనకు మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షలు సోమవారానికి 921వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం మూడు సంవత్సరాలుగా ఉద్యమం జరుగుతున్నా.. మోదీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదన్నారు. ప్రభుత్వరంగ సంస్థలు, ప్రజల ఆస్తులను బీజేపీ భక్తులైన బడా పారిశ్రామిక వేత్తలు అంబానీ, ఆదాని, వేదాంత తదితరులకు కట్టబెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ప్రజలకు రోజురోజుకూ అసహనం పెరిగిపోతోందన్నారు. నిరంకుశ పద్ధతుల ద్వారా కార్మిక, ప్రజా ఉద్యమాలు అణచివేస్తే ప్రభుత్వాలు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలను ఆపాలని, లేనిపక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామన్నారు. దీక్షా శిబిరంలో ఎం.మన్మధరావు, కోట సత్తిబాబు, కె.సత్యనారాయణ, లింగాల వెంకటేష్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు



డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలి.